జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపిక

- కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్
- 2023లో రాతపరీక్ష, ఈ నెల 21న ఫలితాల విడుదల

కమలాకర్

సీసీసీ నస్పూర్, నవంబర్ 22 : సీసీసీ నస్పూర్‌కు చెందిన సెరిమెల కమలాకర్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికైయ్యాడు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో 2022లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జూనియర్ లెక్చరర్‌కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 సెప్టెంబర్‌లో రాతపరీక్ష నిర్వహించింది. అందుకు సంబంధించిన ఫలితాలను టీజీఎస్‌పీఎస్‌సీ 21న విడుదల చేసింది. జూనియర్ లెక్చరర్ రిక్రూట్‌మెంట్ ఇంగ్లిష్ విభాగంలో కమలాకర్ ఉద్యోగం సాధించాడు. 2019 నుంచి ఆయన జైపూర్ గురుకులంలో ఇంగ్లిస్ మీడియం టీజీటీగా పనిచేస్తున్నాడు. గతంలో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశాడు. 2018లో జాతీయ అర్హత పరీక్ష(నెట్), తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(సెట్) ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో అర్హత సాధించాడు. కమలాకర్‌ను కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు, జైపూర్ గురుకులం ఉద్యోగులు అభినందించారు.

ఖైర్‌గూడ ఓసీపీకి బస్సు నడిపించాలి

రెబ్బెన, నవంబర్ 22 : బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీకి సింగరేణి కార్మికులను డ్యూటీకి తీసుకెళ్లే బస్సు సేవలు నిలిచిపోయాయని, వెంటనే ప్రారంభించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో ఎక్కడా లేనివిధంగా కార్మికుల కోసం ఉచిత రవాణా సౌకర్యం ఖైర్‌గూడ ఓసీపీకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సమయానికి టెండర్ ప్రాసెస్ చేయకపోవడంతో బస్సు రద్దు అయి, కార్మికులు ఇబ్బందులుపడుతున్నరని పేర్కొన్నారు. అంబులెన్స్, ఇతర వాహనాల ద్వారా కార్మికులను తీసుకెళ్లడాన్ని టీబీజీకేఎస్ ఖండిస్తుందన్నారు. చాలా మంది కార్మికులు సొంత వాహనాలపై ప్రమాదకర పరిస్థితిల్లో ప్రయాణాలు చేస్తున్నరని పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు గజ్జెల్లి చంద్రశేఖర్, కార్నాధం వెంకటేశం, ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి బొంగు వెంకటేశ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి చందర్, స్వామి, కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు ఓదెలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

జైపూర్, నవంబర్ 22 : మండలంలోని పౌనూర్, కిష్టాపూర్, కుందారం, షెట్‌పల్లి, శివ్వారం, టేకుమట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ శుక్రవారం పరిశీలించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి, మద్దతుధర పొందాలని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. తహసీల్దార్ వనజారెడ్డి తదితరులున్నారు.

తాండూర్, నవంబర్ 22 : తాండూర్, అచ్చలాపూర్, రేచినిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయాధికారి కే సుష్మతో కలిసి తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పరిశీలించారు. గిర్దావార్ ఎజాజుద్దీన్, ఏఈవో శంకర్, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్, సిబ్బంది అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాగజ్‌నగర్, నవంబర్ 22 : విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాలల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో పెట్రోల్ పంప్ ఏరియాలో గల మహాత్మా జ్యోతిబాపూలే, తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, పరిసరాలు, వంట సామగ్రి, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని తెలిపారు. పదోతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. సౌకర్యాలు, విద్యాబోధన తీరుపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించి, వంట సామగ్రి నిల్వలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి సజీవన్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో సమగ్ర సర్వేలో సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేస్తున్న తీరును సబ్‌కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. దివ్యాంగుడైన జాకీర్ పాషా రెండు చేతులు లేకపోయినా కాలివేళ్లతో డేటా ఎంట్రీ చేస్తున్న తీరును పరిశీలించి, అభినందించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసిల్దార్ కిరణ్ కుమార్, సిబ్బంది క్రాంతి, రఫీక్, కార్తీక్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

యువకులకు అవగాహన..

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 22 : పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువకులకు కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ధర్మసేవ స్వచ్ఛంద సంస్థ-హైదరాబాద్ ప్రతినిధులు రిషాంత్ రెడ్డి, శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముఖ్యంగా యువత నైపుణ్యత వైపు దృష్టిపెట్టాలని, మానసికంగా దృఢంగా ఉండాలని, చెడు మార్గాల వైపు వెళ్లకూడదని సూచించారు. ఈ సందర్భంగా యువత, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కెరీర్ గైడెన్స్‌పై ధర్మసేవ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అలాగే ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 23న జిల్లాలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల తాటియా గార్డెన్స్‌లో వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి

మంచిర్యాల టౌన్, నవంబర్ 22 : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆసరా పెన్షన్‌లు పెంచుతామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. దివ్యాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు, కొత్త పెన్షన్ మంజూరు కోసం 24.85 లక్షల మంది ఎదురు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, స్థానిక సంస్థల నుంచి చట్ట సభల వరకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా గుర్తిస్తూ గత ప్రభుత్వం జీవో 34 తీసుకువచ్చిందని, దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దివ్యాంగుల శాఖను బలోపేతం చేసి 33 జిల్లాల్లో ఉద్యోగులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని, దివ్యాంగులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు బుర్ల మహేందర్, మేడపట్ల సతీష్, బీవీ అప్పారావు, రాచర్ల రాజయ్య, రామ శ్రీనివాస్, బండోజు నరేశ్, ఎజాస్, ఇందూరి రమేశ్, ప్రకాశ్, మల్లేశ్, శ్రీనివాస్, లింగమూర్తి, రవి పాల్గొన్నారు.

మంచిర్యాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

స్పోర్ట్స్ కరాటే జిల్లా కమిటీ

నస్పూర్, నవంబర్ 22 : మంచిర్యాల జిల్లాస్థాయి స్పోర్ట్స్ కరాటే నూతన కమిటీని శుక్రవారం మంచిర్యాలలోని శుభం ఫంక్షన్‌హాలులో ఎన్నుకున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేశ్ తెలిపారు. అధ్యక్షులుగా విజ్జగిరి రవి, ప్రధాన కార్యదర్శిగా మాటూరి శివమహేశ్, కోశాధికారిగా ఎనగందుల వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా ముల్కల శంకర్, ఆవుల రాజనర్సు, జితేందర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, సందీప్, భారతి, శ్రీలేఖ, ఈసీ మెంబర్లుగా వెంకటస్వామి, మల్లయ్య, మౌనిక, గణపతి, నరేశ్, మధునయ్య, లీగల్ అడ్వైజర్‌గా రహమతుల్లా ఏకగ్రీవంగా ఎన్నికైనటుల వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి కీర్తి రాజ్‌వీరు, కట్కూరి వెంకటేశ్, రఘునాథ్‌రెడ్డి, తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రజలు మోసపోవద్దు

బెల్లంపల్లి, నవంబర్ 22 : బెల్లంపల్లి మండలం కన్నాల శివారు జాతీయ రహదారి పక్కన గల స్థలాన్ని మాయమాటలు చెప్పి విక్రయిస్తున్నారని, ఆరిజన్ డెయిరీ నిర్వాహకుడు ఆదినారాయణను ప్రజలు నమ్మవద్దని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వే నంబర్ 89/2లోని స్థలం రైతు షిండే దేవానంద్‌కు చెందినదని తెలిపారు. అయితే ఆ భూమిని తన వద్ద కొనుగోలు చేశానని చెబుతూ ఆదినారాయణ కొందరి వద్ద డబ్బు తీసుకున్నారని ఆరోపించారు. ఈ భూమిపై తనకు గానీ, ఆదినారాయణకు గానీ సంబంధం లేదని స్పష్టం చేశారు.

కాసిపేటలో అఘోరీలు

కాసిపేట, నవంబర్ 22 : కాసిపేట మండల కేంద్రంలో కోదండ రామాలయంలో అఘోరీలు ప్రత్యక్షమయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని నుంచి తిరుమల తిరుపతి దేవస్థానికి బయల్దేరారు. ఈ క్రమంలో మధ్యలో అన్ని దేవాలయాలను దర్శించుకుంటున్నారు. కాగా, కాసిపేట కోదండ రామాలయంలో స్వామిని దర్శించుకున్నారు. స్థానికులు భారీగా తరలివచ్చి అఘోరీలను వీక్షించారు.

24, 25 తేదీల్లో ఓటరు నమోదు

వేమనపల్లి, నవంబర్ 22 : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

జైనూర్, నవంబర్ 22 : పట్నాపూర్‌కు చెందిన రైతు డుర్రె రాందాస్ (44) ఆర్థిక ఇబ్బందులతో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ డీ సాగర్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. రాందాస్ తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో మనస్థాపం చెంది గ్రామ శివారులోని రోడ్డు పక్కన పురుగుల మందు తాగాడు. అతని భార్య శకుంతల, ఆమె మరిది దేవిదాస్, అల్లుడు రాందాస్‌ను ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శంకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సీసీసీ నస్పూర్, నవంబర్ 22 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నస్పూర్ ఆయూష్ మెడికల్ ఆఫీసర్, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ జీ పద్మజ పేర్కొన్నారు. నస్పూర్ పీహెచ్‌సీలో శుక్రవారం యోగాపై ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు సమత, యోగా శిక్షకులు సుధాకర్, మేఘన, హెచ్ఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా కేంద్రం ప్రారంభం

బెజ్జూర్, నవంబర్ 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం యోగా కేంద్రాన్ని మండల ఆర్ఐ అచ్యుత్‌రావు ప్రారంభించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా యోగా చేసేందుకు ట్యూటర్లను నిమించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ. యోగా సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

వేమనపల్లి, నవంబరు 22 : వేమనపల్లి మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు ఏట మధూకర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. మండల ప్రధాన కార్యదర్శి ఎనుముల వెంకటేశ్, నాయకులు కంపెల అజయ్, చౌదరి మధునయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జన్మదిన వేడుకలు

రెబ్బెన, నవంబర్ 22 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల భగవాన్ శ్రీ సత్యసాయి భజన మండలి వద్ద సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు భజన మండలి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభవుతాయని సాయంత్రం 8.30 గంటల వరకు కొనసాగుతాయని, 99 మందికి దుప్పట్లు పంపిణీతో పాటు, అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(యూ)/జైనూర్, నవంబర్ 22 : సిర్పూర్, లింగాపూర్, జైనూర్ మండలాల్లో శనివారం ఉదయం 10 నుంచి మాధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిర్పూర్(యూ) లైన్‌మన్ లక్ష్మణ్, జైనూర్ ఏఈ సాయికృష్ణ శుక్రవారం వేర్వేరుగా ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ నుంచి జైనూర్, సిర్పూర్, లింగాపూర్‌మండలాలకు సరఫరా అయ్యే 11కేవీ లైన్‌కు మరమ్మతులు చేస్తుండడంతో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

కాగజ్‌నగర్, నవంబర్ 22 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రాయల్ గార్డెన్‌లో శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్మికుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్పొరేట్ శక్తులకే ప్రయోజనం చేకూరుతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా కార్యదర్శి త్రివేణి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, పద్మ, జిల్లా నాయకులు కృష్ణమాచారి, శంకర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఒకరి బైండోవర్

జన్నారం, నవంబర్ 22 : జన్నారం రేంజ్ పరిధిలోని పుట్టిగూడ అడవుల్లో టేకుచెట్లను నరికిన బాదపెల్లి గ్రామానికి చెందిని జాడి రాజన్నను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు. ఎఫ్‌బీవో శ్రీనివాస్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All
BUSINESS OFFER
★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ పెద్దపల్లి సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9346756075
NTK-00000
CHANGE OF NAME
I, JILLALA SWAPNA (Old Name) W/o. JILLALA SAJAN KUMAR R/o.H.No. 5-36/1, Sy. No. 110, Laxmi Srinivasa Colony, Naspur, Mancherial Dist, 504302, Telangana State, India, have Changed My name as JILLALA SWAPNA RANI (New Name) for all future Purposes.
పాస్‌పోర్ట్ పోయినది
నేను దర్శనం సాయికుమార్ తండ్రి దర్శనం సాయన్న, నివాసం: ఇ.నెం. 9-30, గ్రామం & మండలం సోన్, జి॥ నిర్మల్, తెలంగాణ - 504105 నా యొక్క పాస్‌పోర్ట్ నెం. R5270345 తేది: 17-11-2024 రోజున సోన్ నుండి మాదాపూర్‌కు బైక్ పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
సెల్: 6301390443
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

పశు యజమానులకు పరిహారం అందజేత

రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న ఎఫ్ఆర్వో అనిల్ కుమార్

పెంచికల్ పేట్, నవంబర్ 22 : పెద్దపులి దాడిలో ఇటీవల పలుచోట్ల పశువుల మృతిచెందాయి. కాగా, పశువుల యజమానులకు పరిహారం చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు గుండెపల్లికి చెందిన సిడాం కిషన్ రావుకు రూ.20వేలు, కమ్మర్గాంకు చెదిన ఆత్రం విష్ణుకు రూ.14వేల చెక్కులను ఎఫ్ఆర్వో కార్యాలయంలో శుక్రవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్ అందజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పులుల సంచారం ఎక్కువ ఉన్నందున ఆటవీ ప్రాంత రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు ఆస్మ, జగన్మోహన్ గౌడ్, ఎఫ్‌బీవోలు విజయలక్ష్మి, శ్రావణ్, సతీశ్, లచ్చన్న, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జైనూర్, నవంబర్ 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావ్ పర్యవేక్షణలో జైనూర్ మండలంలోని పొచ్చంలొద్ది కస్తూర్బా బాలికల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకకు చట్టాలపై అవగాహన కల్పించారు. షీటీం డివిజన్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో మహిళలకు రక్షణ కల్పించేందుకు షీ టీంలు పనిచేస్తున్నాయని, అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు. షీటీం ఆసిఫాబాద్ పోన్ నంబర్ 8712670564కు సంప్రదించాలని సూచించారు.

కౌటాల, నవంబర్ 22 : సిర్పూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు బాలిక భరోసా, షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. భరోసా టీం ఇన్‌చార్జి డబ్ల్యూఎస్ఐ తిరుమల గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం ప్రకారం అమలులో ఉన్న శిక్షల గురించి, బాల్య వివాహాల నిరోధక చట్టం తదితరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, భోరోసా టీం సభ్యులు పాల్గొన్నారు.

కౌటాల, నవంబర్ 22 : సిర్పూర్(టీ) పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్తులకు కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ చంద్రశేఖర్ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

సింహ గర్జన పోస్టర్లు విడుదల

లక్షెట్టిపేట, నవంబర్ 22 : పట్టణంలోని ఐబీలో మాలల సింహ గర్జన పోస్టర్లను ఆ సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మాలల ఐక్యతను చాటి చెప్పేందుకు డిసెంబర్ 15న హైదరాబాద్‌లో నిర్వహించే సింహ గర్జనకు మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కన్వీనర్ తోగరు సుధాకర్, సుధీర్, లక్ష్మణ్, కుంబాల రాజేశ్, బొజ్జ శరత్, వెంకటరమణ, దొంత నర్సయ్య, గరిసె రవీందర్, మాలెం చిన్నయ్య, బూపెల్లి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం, నవంబర్ 22 : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సింహగర్జన పోస్టర్లను జిల్లా జేఏసీ కన్వీనర్ తొంగారి సుధాకర్, గజెల్లి లక్షన్ విడుదల చేశారు. మాలమహానాడు నాయకులు జే సుధీర్, బీ మల్లన్న, రాష్ట్ర కార్యదర్శి బెంజిమెన్, శరత్, పాత బాల్ రాజ్, సిటిమల్ల భరత్‌కుమార్, కరుణాకర్, మేకల మాణిక్యం, సృజన్, పద్మారావు, అలుగునూరి రవి తదితరులు పాల్గొన్నారు.

'మరింత అభివృద్ధి చేస్తా'

మంచిర్యాల అర్బన్, నవంబర్ 22 : మంచిర్యాలను మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి మాట్లాడారు. మంచిర్యాలలో క్యాన్సర్ దవాఖాన ఏర్పాటుకు అవకాశం ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. మంత్రులు శ్రీధర్ బాబు, రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ముల్కల్ల-బసంత్ నగర్‌కు అనుసంధానంగా గోదావరిపై బ్రిడ్జి నిర్మాణం ప్రక్రియ త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణాధ్యక్షుడు తూముల నరేశ్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

మూడు బైకులు దగ్ధం

పూర్తిగా కాలిపోయిన బైకులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 22 : ఎలక్ట్రిక్ బైకు బ్యాటరీ పేలి, మూడు బైకులు దగ్ధమైన సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలోని చింతపండువాడలో కలకలంరేపింది. ఇంటి యజమాని అప్పని నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఒకే దగ్గర 5 బైకులు పార్క్ చేసి ఉన్నాయి. శుక్రవారం ఒంటి గంట సమయంలో ఫల్కాన్ బెన్‌ఎల్‌జీ బ్యాటరీ బ్యైక్‌లో పొగలు వచ్చి, మంటలు చెలరేగాయి. బ్యాటరీ పేలడంతో పక్కనే ఉన్న వారం కిందట కొనుగోలు చేసిన సుజుకీ ఆక్టీవా, ఎస్‌పీ 125 హోండా రెండు బైకులకు మంటలు అంటుకునాయి. మూడు బైకులు పూర్తిగా కాలిపోయాయి. వాటి పక్కనే ఉన్న ఎన్‌ఫీల్డ్, హోండా షైన్‌ను పక్కకు తీశారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు నాగరాజు తెలిపాడు.

కారు ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కాగజ్‌నగర్, నవంబర్ 22 : కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో శుక్రవారం జరిగిన కారు ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ పోల